క్లుప్తంగా

నేడు హుజూర్‌నగర్‌కు జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాక

హుజూర్‌నగర్ : సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి శనివారం హుజూర్‌నగర్ న్యాయస్థానానికి రానున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హుజూర్‌నగర్‌కు నూతనంగా మంజూరైన అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభోత్సవ ఏర్పాట్లు, పట్టణ పరిధిలోని న్యాయస్థానాల సముదాయం, న్యాయమూర్తుల గృహ సముదాయాల నిర్మాణాలకు కేటాయించిన స్థలాన్ని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్‌లతో కలిసి పరిశీలిస్తారని ఆయన పేర్కొన్నారు.

స్వాతి నక్షత్రం ట్రస్ట్ ఆశ్రమంలో తిరునక్షత్ర పూజలు



పూజలు చేస్తున్న ముక్కూరు శ్రీనివాసన్

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో చెన్నైకు చెందిన శ్రీముక్కూరు లక్ష్మీనరసింహాచార్యర్‌కు గల స్వాతి నక్షత్రం ట్రస్టు ఆశ్రమంలో శుక్రవారం తిరునక్షత్ర పూజలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరునక్షత్ర పూజలు, శ్రీనారసింహ మహాయజ్ఞం రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో చెన్నై ట్రస్టు చైర్మన్ ముక్కూరు శ్రీనివాసన్, ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు మట్టపల్లిరావు, అర్చకులు, చెన్నైకి చెందిన భక్తులు పాల్గొన్నారు.

24న దివ్యాంగుల ఉపకరణాలకు ఎంపిక శిబిరం

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : సూర్యాపేటలోని మిర్చి యార్డులో ఈనెల 24వ తేదీన దివ్యాంగుల ఉపకరణాలకు ఎంపిక శిబిరం ఉంటుందని 2016 చట్టం మానిటరింగ్ కమిటీ సభ్యుడు చిలక నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం చింతలపాలెంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మహా సిమెంట్ సహకారంతో శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ విజయనగరం ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉపకరణాలు కావాల్సిన వారు రెండు పాస్ ఫొటోలు, సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు తీసుకొని రావాలని ఆయన తెలిపారు.

వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఇత్తడి తొడుగు బహూకరణ



సింహద్వారానికి ఇత్తడి తొడుగు ఏర్పాటు చేయించిన శ్రీనివాసరావు దంపతులు

గరిడేపల్లి : మండలంలోని అప్పన్నపేట గ్రామంలో గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని సింహద్వారానికి పాలిశెట్టి శ్రీనివాసరావు- సంధ్య దంపతులు రూ. 50వేల ఇత్తడి తొడుగులు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా శుక్రవారం దాతలను గ్రామస్తులు సన్మానించారు.

బాసర ట్రిపుల్ ఐటీలో సీటు


నేరేడుచర్ల : పట్టణంలోని శ్రీవాణి స్కూల్ విద్యార్థి చందా లక్ష్మీప్రియ బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ఈ సందర్భంగా లక్ష్మీప్రియను పాఠశాల కరస్పాండెంట్ కొణతం సీతారాంరెడ్డి శుక్రవారం పాఠశాలలో అభినందించారు.

మహిళకు అరుదైన శస్త్ర చికిత్స

- 5 కిలోల కణితి తొలగింపు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శుక్రవారం మహిళకు వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేసి 5 కిలోల అండాశయ కణితిని తొలగించారు. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన 35 ఏళ్ల మహిళ కొద్ది రోజులుగా ఓవరిన్ ట్యూమర్‌తో బాధపడుతోంది. దీంతో పలు ఆసుపత్రులు తిరిగి చికిత్స చేయించుకున్నా ఆమెకు నొప్పి తగ్గలేదు. శుక్రవారం నొప్పి విపరీతంగా రావడంతో స్థానిక ప్రైవేటు హాస్పిటల్‌లో చేరింది. పరీక్షించిన డాక్టర్ ఆమెకు శస్త్ర చికిత్స చేసి 5 కిలోల అండాశయ కణితిని తొలగించారు. శస్త్ర చికిత్స తర్వాత మహిళ ఆరోగ్యంగా ఉందని డాక్టర్ తెలిపారు.

సబ్ పోస్టుమాస్టర్‌కు సన్మానం



సన్మానిస్తున్న బీపీఎంలు

గరిడేపల్లి : మండల కేంద్రంలోని సబ్ పోస్టు ఆఫీస్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న సబ్ పోస్టుమాస్టర్ ధరావత్ చందులాల్‌నాయక్‌ను శుక్రవారం సీనియర్ ఏబీపీఎం చలిగంటి పుల్లారావు ఆధ్వర్యంలో గ్రామీణ తపాలా ఉద్యోగులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోస్టుమాస్టర్లు ప్రతాప్‌సింగ్, ఖాజావలి, రాంరెడ్డి, సిరాజుద్దీన్, బీపీఎంలు చంద్రయ్య, తిరపయ్య, బలరాం, సంజీవ్, శ్రీయాంక, రాంబాబు, తేజ్, రమ్య, అంజయ్య, ఏబీపీఎంలు శ్రీనునాయక్, సైదులు, వనజ, కవి, శ్రీలేఖ, సంధ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

హుజూర్‌నగర్ : ఎంబీసీ లిఫ్ట్ పంపు హౌజ్ నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. చింతలపాలెం మండలం వెల్లటూరు రెవెన్యూ పరిధిలో నూతనంగా నిర్మించే ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ (ఎంబీసీ) లిఫ్ట్ పంపు హౌజ్ నిర్మాణానికి 68.28 ఎకరాల స్థలాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ సురేందర్ రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంబీసీ కెనాల్ పనుల పరిశీలన..

హుజూర్‌నగర్ శివారులో జరుగుతున్న ఎన్నెస్పీ కాలువ ఆధునీకరణ పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పరిశీలించారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్దేశిత సమయంలోగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, నీటిపారుదల ఎస్ఈ ఎస్.నరసింహారావు, ఈఈ కె.శ్రీనివాస్, డీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

మునగాల : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. శుక్రవారం ఆయన మునగాలలో జెడ్పీహెచ్ఎస్, పీహెచ్‌సీని తనిఖీ చేశారు. హాజరు పట్టికలను పరిశీలించారు. తనిఖీ సమయంలో పీహెచ్‌సీ వైద్యాధికారి విధుల్లో లేకపోవడంతో ఆయనతో ఫోన్‌లో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేశారు. ల్యాబ్ టెక్నీషియన్ కూడా లేకపోవడంతో సిబ్బందిని ప్రశ్నించగా కౌన్సిలింగ్‌కు వెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. హెచ్ఎం పిడతల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు ఎర్ర అంజన్‌రెడ్డిని అడిగి పలు వివరాలు తెలుసుకున్నారు. అలాగే నూతనంగా నిర్మిస్తున్న పీహెచ్‌సీ భవనాన్ని త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని కాంట్రాక్టర్ ఆదేశించారు.



హుజూర్‌నగర్ : ఎంబీసీ లిఫ్ట్ పంప్ హౌజ్ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్



మేళ్లచెరువు : పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మందుల స్టోర్, స్టాక్ రికార్డులను ఆయన పరిశీలించారు. అదేవిధంగా సిబ్బంది హాజరు రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో మలేరియా, డెంగీ జ్వరాలతో ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారికి టెస్టులు చేపట్టి రిపోర్టు ఆధారంగా చికిత్స అందించాలని డాక్టర్‌ను ఆయన ఆదేశించారు. ఆయన వెంట హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, డాక్టర్ వేణుగోపాల్, తహసీల్దార్ జ్యోతి తదితరులు ఉన్నారు.

30 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటించాలి

మోతె : ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం 30 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యామ రమేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మోతె మండల కేంద్రంతో నేరేడవాయి, నాగయ్యగూడెం, కరక్కాయలగూడెం, ఉర్లుగొండ, తుమ్మగూడెం, నర్సింహాపురం, బోడబండ్లగూడెం, అన్నారిగూడెం తదితర గ్రామాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు ఆయన టీపీయూఎస్ సభ్యత్వాలు అందజేసి మాట్లాడారు. ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న మెడికల్ రియింబర్స్‌మెంట్, సరెండర్ లీవ్ తదితర బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ నాయకులు బైరు తిరుమలేష్, బట్టిపల్లి సాయికుమార్, సురబీ శ్రీధర్, మిర్యాల శంకర్, ఆలె గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



మోతెలో టీపీయూఎస్ సభ్యత్వం అందిస్తున్న యామ రమేష్

వీధిలైట్లు ప్రారంభం

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని 8వ వార్డులో పాత నేరేడుచర్ల నుంచి శాంతినగర్‌కు వెళ్లే రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వీధి లైట్లను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అలక సరిత, కౌన్సిలర్లు కొనతం చిన వెంకట్‌రెడ్డి, కోదమగుండ్ల సరిత, రణపంగ నాగయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, నాయకులు పారేపల్లి శేఖర్‌రావు, సైదులు, శ్రీనయ్య, వెంకట్‌రెడ్డి, నగేష్, లీలామనుష్‌రెడ్డి, నూకల వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మఠంపల్లి : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 33 మంది లబ్ధిదారులకు రూ.33 లక్షల 3వేల 480 విలువ గల కల్యాణలక్ష్మి చెక్కులను తహసీల్దార్ మంగారాథోడ్ పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రోత్సాహకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ బాలరాజు, బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి చింతల వెంకటనారాయణ, జేపీ ఉపేందర్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా నిలిచేది కమ్యూనిస్టులే

నేరేడుచర్ల : పేదలకు అండగా నిలిచేది ఒక్క కమ్యూనిస్టులేనని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం నేరేడుచర్లలో జరిగిన పాలకీడు, నేరేడుచర్ల మండలాల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అందాల్సిన ఫలాలను బూర్జువా పార్టీల నేతలు తన్నుకుపోతున్నారని ఆరోపించారు. బీజేపీ పెట్టుబడుదారులకు తొత్తుగా మారిందని అన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దూళిపాల ధనుంజయనాయుడు, మండల, పట్టణ పార్టీ కార్యదర్శులు యల్లబోయిన సింహాద్రి, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీనివాస్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు ఉదర వెంకన్న, నాయకులు భాస్కర్, గోవిందు, అంజయ్య, నాగేశ్వర్‌రావు, అశోక్, వెంకటేశ్వర్లు, నర్సమ్మ, మంగ, అరుణ తదితరులు ఉన్నారు.

అమరవీరుల త్యాగం మరువలేనిది

మునగాల : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో మునగాల పరగణాకు చెందిన అమరవీరుల త్యాగం మరువలేనిదని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని చిల్లంచర్ల రఘునాథం స్మారక భవనంలో నిర్వహించిన సీపీఐ విస్తృత నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెల్లరేషన్ కార్డు అనే ఆంక్షలు లేకుండా రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని కోరారు. మండల కార్యదర్శి చిల్లంచర్ల ప్రభాకర్, నాయకులు రాఘవరెడ్డి, గుండగాని శ్రీను, అనంతుల మధు, ఉపేందర్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.



నేరేడుచర్ల: మాట్లాడుతున్న బెజవాడ వెంకటేశ్వర్లు

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

- నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ ప్రకాశ్

నేరేడుచర్ల : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో నేరేడుచర్ల మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్ అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల మున్సిపల్ కార్యాలయంలో 2024- 25 సంవత్సరానికి సంబంధించిన అభివృద్ధి పనులపై చైర్మన్ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో రూ.49 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సభ్యులు ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించినట్లు తెలిపారు. మంత్రి ఉత్తమ్ జోక్యంతో గతంలో మంజూరైన రూ.15 కోట్లతో చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో పనులకు ప్రణాళికల నివేదికను మంత్రికి అందించగా నిధులు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ కౌన్సిలర్ కొణతం చిన వెంకట్‌రెడ్డి తెలిపారు. 15వ వార్డులో నీటి సరఫరా సక్రమంగా జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వార్డు కౌన్సిలర్ కుంకు సులోచనశ్రీనివాస్‌రావు సభ దృష్టికి తీసుకురాగా, నూతన పైపులైన్ కోసం ప్రతిపాదనలు పంపినట్లు చైర్మన్ ప్రకాశ్ తెలిపారు. రెండవ వార్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ట్యాంకులోకి నీరు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, మున్సిపాలిటీలో 16లక్షల లీటర్ల మంచినీటి సరఫరా జరగాల్సి ఉండగా కేవలం 10 లక్షలు మాత్రమే సరఫరా అవుతుందని కౌన్సిలర్ రణపంగ నాగయ్య తెలిపారు. త్వరలో నీటి సమస్యలను పరిష్కరిస్తామని ఏఈ శ్రీనాథ్ తెలిపారు. రాజీవ్‌నగర్ నుంచి శివాలయం బజారు వరకు వీధి లైట్లు ఏర్పాటుకు విద్యుత్‌లైన్ నిర్మించాలని కౌన్సిలర్ బాషా కోరారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు పిర్యాధు చేస్తామని మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అలక సరితాసైదిరెడ్డి, కౌన్సిలర్లు కోదమగుండ్ల సరిత, వేమూరి నాగవేణి, అమరారపు లలితాభరత్, బైరెడ్డి జితేందర్‌రెడ్డి, తాళ్లూరి సాయి, షహనాజ్, టీపీఓ సోమయ్య, ఏఈ స్వాతి, ట్రాన్స్‌కో ఏఈ పందిరి శ్రీనివాస్, అకౌంటెంట్ శారద తదితరులు ఉన్నారు.



మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, చైర్మన్

'ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం'

హుజూర్‌నగర్‌రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకుందని హుజూర్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కరక్కాయలగూడెం, మర్రిగూడెం, గోపాలపురం గ్రామాల్లో నిర్వహించిన రుణమాఫీ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రపటాలకు ఆ పార్టీ నాయకులతో కలిసి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దొంగరి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ మచ్చా వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ నాగసైదయ్య, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

రేవంత్, ఉత్తమ్ చిత్రపటాలకు పాలాభిషేకం

మునగాల : ప్రభుత్వం ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీ అమలు చేస్తూ రైతాంగం పట్ల ఉన్న విశ్వాసాన్ని నిరూపించుకుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య అన్నారు. శుక్రవారం మునగాల మండలంలోని తాడువాయిలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ, రైతుల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వట్యావుల సైదులు, మండల కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, మండల యూత్ అధ్యక్షుడు జిల్లేపల్లి శ్రీనివాస్, నాయకులు గట్టు ఉపేందర్‌రావు, దేశగాని యాదగిరి, కొండమీది గుర్వయ్య, దేవరం సుధీర్‌రెడ్డి, లొడంగి కృష్ణయ్య, గట్టు వెంకటేశ్వర్లు, వినయ్ పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌రూరల్ : సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు

రుణమాఫీ సంబరాలు

మఠంపల్లి : ప్రభుత్వం రూ. 2 లక్షల రుణమాఫీని ప్రారంభించడంతో శుక్రవారం మఠంపల్లి మండలంలోని కొత్తతండా, కాల్వపల్లితండాల్లో గిరిజనులు సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఆంజనేయస్వామి ఆలయం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సుజాతాసక్రు నాయక్, విజయాబాలానాయక్, మాజీ ఎంపీటీసీ బాలానాయక్, ఉత్తమ్ యువసేన నాయకుడు మాలోతు సక్రు, గిరిజనులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీపై హర్షం

అనంతగిరి : రైతు రుణమాఫీపై కాంగ్రెస్ పార్టీ అనంతగిరి మండల గౌరవ అధ్యక్షుడు కొండపల్లి వాసు శుక్రవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేసి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని తెలిపారు.



మునగాల : సీఎం, మంత్రి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు, రైతులు



మఠంపల్లి : సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న గిరిజన నాయకులు

దాతల సహకారం అభినందనీయం

గరిడేపల్లి : దాతల సహకారం అభినందనీయమని లయన్స్ క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల అధ్యక్షుడు జిలకర రామస్వామి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తుంబాయి గడ్డ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం జంపాల శ్రీను జ్ఞాపకార్థం కుమారుడు జంపాల అనిల్‌కుమార్ అందజేసిన సహకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చల్లా ప్రభాకర్‌రెడ్డి, సైదిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, క్లబ్ సభ్యులు చిలకరాజు శ్రీను, అప్పాచారి తదితరులు పాల్గొన్నారు.

నోటు బుక్స్ అందజేత

అనంతగిరి : విద్యార్థులు బాల్యంలోనే ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలని ఎంఈఓ సలీం షరీఫ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రంగయ్యగూడెం గ్రామంలో గల మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు ఓ దాత గుప్తదానంగా ఇచ్చిన నోట్ బుక్స్, బ్యాగులు, పెన్నులను ఎంఈఓ అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రామినేని సతీష్, ఉపాధ్యాయులు గోపతి ఉపేందర్, గ్రామపెద్దలు సయ్యద్ సీరాజ్, ఖాసీ రిజ్వీ, సయ్యద్ యాకూబ్, హుస్సేన్, సైదులు తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి : విద్యార్థులకు బ్యాగులు, నోటు బుక్స్ అందజేస్తున్న ఎంఈఓ సలీం షరీఫ్

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం



నేరేడుచర్ల : పెంచికల్‌దిన్నలోని అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న సూపర్‌వైజర్ యశోద

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్నలో గల అంగన్‌వాడీ కేంద్రం-1, 2, 3 లలో చిన్నారులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యశోధ సాముహిక అక్షరాభ్యాసం చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోఅందజేసే పౌష్టికాహారాన్ని విద్యార్థులు, బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఎల్. శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు సైదమ్మ, షాహిద్, సుగుణ, ఆయాలు జానమ్మ, కౌసల్య, వైద్య సిబ్బంది జ్యోతి ఉన్నారు.

పోలేనిగూడెంలో..

చిలుకూరు: మండలంలోని పోలేనిగూడెంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు సాముహిక అక్షరాభాస్యం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఉపేంద్ర మాట్లాడుతూ చిన్నారులను విధిగా అంగన్‌వాడీ కేంద్రాలను పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ బాదె రేణుక, తదితరులు పాల్గొన్నారు.



చిలుకూరు : పోలేనిగూడెంలో చిన్నారులకు అక్షరాభాస్యం చేయిస్తున్న సూపర్‌వైజర్, టీచర్

మహిళలకిచ్చిన హామీలు అమలు చేయాలని వినతి



ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి రేణుక

కోదాడరూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాల్సిందేనని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం కోదాడ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఆడపిల్ల పెళ్లి చేస్తే కల్యాణలక్ష్మీతో పాటు తులం బంగారం, ఒంటరి మహిళలకు రూ.2500 నగదు ఇస్తామని చెప్పి అధికారంలో వచ్చి 7 నెలల గడుస్తున్నా నేటికీ అమలు చేయలేదని అన్నారు. లక్ష్మి, పావని, శ్యామల, దుర్గ, అలివేలు, నాగమణి ఉన్నారు.

సమభావన సంఘాలను సక్రమంగా నిర్వహించాలి

చిలుకూరు : వీఓఏలు సమభావన సంఘాలను సక్రమంగా నిర్వహించాలని ఏపీజీవీబీ చిలుకూరు బ్యాంక్ మేనేజర్ ఎస్. శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో సమభావన సంఘాల నిర్వహణపై వీఓఏలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం ద్వారా బ్యాంక్‌లో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించేలా చూడాలని అన్నారు. బ్యాంక్ పరిధిలో 43 సంఘాలు సక్రమంగా లేవని, వాటిని రెగ్యులర్ చేయాలన్నారు. ఫీల్డ్ ఆఫీసర్ అశోక్‌రెడ్డి, ఏపీఎం దుర్గాప్రసాద్, సీసీ కందుకూరి గురుమూర్తి, వీఓఏలు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

హుజూర్‌నగర్ : ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్ల ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి చందర్‌రావు కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్ హాస్టల్ విద్యార్థులకు ధరలకనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని కోరారు. హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, పర్మినెంట్ పోస్టులను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి ఉదయ్, నాయకులు లోకేష్, పృథ్వీసాయి, చరణ్, ఆదిత్య, లోకేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నడిగూడెం : ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లక్ష్మీప్రసన్న కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖానా వైద్యాధికారి హరినాథ్, ప్రిన్సిపాల్ వాణి, వైద్య సిబ్బంది కృష్ణమూర్తి, రాధ, మహేశ్వరి, వెంకటేశ్వర్లు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగర్ కాలువ కట్టపై బందోబస్తు

మునగాల : తాగునీటి అవసరాల నిమిత్తం సాగర్ ఎడమ కాలువకు ప్రభుత్వం నీటిని విడుదల చేస్తున్నందున జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మునగాల మండల పరిధిలో సాగర్ ఎడమ కాలువ కట్టలపై గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఎంపీడీఓ కె.రమేష్ దీనదయాళ్ తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలువ వెంట నిత్యం పహారా ఏర్పాటు చేయాలని, ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకోసం పంచాయతీరాజ్, ఇరిగేషన్, పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందని వారు తెలిపారు.

యూటీఎఫ్ సభ్యత్వాలు నమోదు

నేరేడుచర్ల : పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను ప్రభుత్వం తక్షణమే మంజూరు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్నె గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. జీఓ 317 ద్వారా ఉత్పన్నమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వై.కృష్ణయ్య, నర్సింహారావు, వెంకటేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, వెంకటనర్సయ్య, శ్రీనయ్య, యాదగిరి, అక్కయ్యబాబు తదితరులు ఉన్నారు.



సభ్యత్వాలు నమోదు చేస్తున్న అనిల్‌కుమార్

హాస్టల్‌లో గంజాయి వ్యాపారం

- దాడులు చేసిన నార్కోటిక్ పోలీసులు
- ఆరుగురు విద్యార్థుల అరెస్ట్
- అందులో ఒకరు హుజూర్‌నగర్ వాసి

ఇబ్రహీంపట్నం: ప్రైవేట్ హాస్టల్‌లో గంజాయి సేవిస్తూ.. విక్రయిస్తున్న విద్యార్థితో పాటు మరో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన శ్రీరాములు సాత్విక్(21) రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతూ అక్కడే ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్నారు. సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటకు చెందిన నవీన్(25) గంజాయి విక్రయిస్తుంటాడు. ఇటీవలే నవీన్ భద్రాచలం నుంచి రెండున్నర కిలోల గంజాయి తీసుకొచ్చి చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయిస్తున్నాడు. నవీన్‌తో ఉన్న పాత పరిచయంతో అతని వద్ద సాత్విక్ 500 గ్రాముల గంజాయి కొనుగోలు చేసి హాస్టల్‌కు తీసుకువచ్చాడు. నార్కోటిక్ పోలీసులకు అందిన సమాచారంతో హాస్టల్‌పై దాడిచేసి సాత్విక్‌తో పాటు 500గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై విచారణ చేసిన పోలీసులు.. అదే హాస్టల్‌లో ఉంటున్న జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణం సాయిరాంనగర్ కాలనీకి చెందిన నూకల సంపత్‌నాయుడు(20), సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణం వెంకట్‌నగర్ కాలనీకి చెందిన స్వయంపాకుల కార్తీక్(20)ను, మరో హాస్టల్‌లో ఉంటున్న ఖమ్మం జిల్లా ఖానాపూర్ గ్రామానికి చెందిన గద్దల ప్రేమ్‌కుమార్(18)ను అదుపులోకి తీసుకున్నారు. వీరి ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా.. హైదరాబాద్ నగరంలోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ హాస్టల్‌లో ఉంటూ.. హోటల్ మేనేజ్‌మెంట్ చేస్తున్న జగిత్యాల జిల్లా పొలాసకు చెందిన పడాల వంశీ(20), హస్నాబాద్‌కు చెందిన దుంపేట గణేశ్ (21)ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నవీన్ పరారీలో ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ వెల్లడించారు.